క్లుప్తంగా

ఆలయ ప్రాంగణంలో ఔషధ మొక్కల పెంపకం



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కీర్తి పట్నాయక్

దాబాగార్డెన్స్: పాతనగరం శృంగమణి పర్వతంపై వెలసిన పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి విజ్ఞాన జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ శుక్రవారం హరిత వనం పేరిట ఔషధ, (పమిడి పత్రి) పూలమొక్కలు నాటారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, అలయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పి. మురళీధర్, ఎం. నాగేశ్వరరావు, టి. వెంకటాచారి, యూజీఆర్ పట్నాయక్ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు కీర్తి పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా 12 రాశి వనాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ సురేష్, అల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ పార్క్ పనులు ప్రారంభం



నక్కవానిపాలెంలో ఇందిరా గాంధీ పార్క్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ పార్క్ అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వీటి కోసం జీవీఎంసీ రూ.8 లక్షల నిధులు విడుదల చేయడం తెలిసిందే. కొన్నేళ్లుగా పర్యవేక్షణ లేకపోవడంతో పార్కులోని వస్తువులు తుప్పుపట్టి పాడయ్యాయి. ఎట్టకేలకు ఈ ఉద్యానవన పూర్వవైభవానికి అడుగు ముందుకు పడింది. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పెద్దలు సాయంత్రం వేళ వచ్చి కాలక్షేపం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తమ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తుండటంతో నక్కవానిపాలెం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు శుక్రవారం లైబ్రరీ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఏడు గ్రూపులుగా పాల్గొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన వర్తమాన అంశాలు, చరిత్ర, సాంకేతిక, విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 60 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్‌మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఉద్యోగార్థుల సామర్థ్యాలు తెలుసుకోవడానికి ఇటువంటి క్విజ్ పోటీలు దోహదపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ కార్యవర్గ ప్రమాణం నేడు

మురళీనగర్: ఇటీవల ఎన్నికైన ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు పాలకవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటలకు సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు హాజరవుతారని చెప్పారు. ప్రమాణ స్వీకార అనంతరం స్థానిక వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో అన్నసమారాధన చేస్తామన్నారు.

జోరుగా రహదారి విస్తరణ



మాధవధార 48 లాస్ట్ బస్‌స్టాప్ వద్ద నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులు



51వ వార్డు కార్యాలయం వద్ద జరుగుతున్న పనులు

- 60 అడుగులుగా మాధవధార రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో అభివృద్ధి పరుగులు పెడుతోంది. 15వ ఆర్థిక సంఘం మంజూరు చేసిన రూ.4.40 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్ అండ్ బీ జంక్షన్ హోటల్ మారియట్ నుంచి మాధవధార వుడా కాలనీ 48ఏ బస్ స్టాప్ వరకు రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. అనేక రకాల యంత్ర పరికరాలతో జీవీఎంసీ పనులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం 40 అడుగులు ఉన్న రహదారిని 60 అడుగులకు విస్తరిస్తున్నారు. మట్టిని తీసి వెట్‌మిక్స్ మెటీరియల్, జీఎస్‌బీసీ మెటీరియల్ వేసి పాత రోడ్డుకు సమానంగా చేసే పనులు ప్రస్తుతం పూర్తి చేస్తున్నారు. నడిచేందుకు వీలుగా ఫుత్‌పాత్‌లు కూడా నిర్మించనున్నారు. 60 ఫీట్ రోడ్డు, 1.75 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మాధవధార రోడ్డు విస్తరణతోపాటు టౌన్ ప్లానింగ్ పనులతో కలిపి అన్నీ పూర్తి కావడానికి సుమారు రెండు, మూడు నెలల సమయం పడుతుందని తెలియజేశారు.

పెరిగిన రాకపోకలు..

గతంలో ఈ రోడ్డు గతుకులు, గుంతలమయంగా ఉండేది. ఇప్పుడు వార్డు అభివృద్ధి చెందడంతో జాతీయ రహదారికి సమానంగా ఉండడంతో ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. మారియట్ హోటల్ నుంచి హెచ్‌బీ కాలనీ మార్గం గుండా వెంకోజీపాలెం వరకు నేరుగా వెళ్లిపోవడానికి ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో గతంలో కంటే ఈ రోడ్డులో ప్రయాణాలు ఎక్కువగా సాగుతున్నాయి. అందులోనూ 48 బస్ రూటు ఉండడంతో పోర్టు హాస్పిటల్ మార్గం, అక్కయ్యపాలెం మీదుగా కాంప్లెక్స్‌కు వెళ్లి నేరుగా పాత పోస్టాఫీస్‌కు ఈ బస్సు వెళ్తుంది. ఈ వార్డుకు సంబంధించి రామన్న కాలనీ, అంబేడ్కర్ కాలనీ, పవర్ ఆఫీస్, వాంబే కాలనీ, మాధవధార, కళింగనగర్, వుడా కాలనీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈ ప్రాంతాల్లో 50 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఈ రోడ్డును బాగుచేయడంతోపాటు విస్తరించడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు వార్డులో పర్యటించి తగు సూచనలిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 44వ వార్డు రామచంద్రానగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో ఎంతో మంది రాజకీయ నాయకులను చూశామని, వారు స్వార్థం కోసం రాజకీయాలు చేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం ప్రజలకు మంచి చేయలన్న దృఢసంకల్పంతోనే అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అటువంటి నాయకుడి వెంట ప్రజలంతా వెన్నంటి ఉండాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాయుడు శ్రీను, నూకరాజు, వార్డు నాయకులు హబీబ్, హీర, మహదాస్య గోపి, వెంకటరావు, వాసు, గోపి, సీతారామ్, రెడ్డి ప్రసాద్, బషీర్, బేగం తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు



ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న సీతారామ్

సీతంపేట: బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు అక్కయ్యపాలెం నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బాలల హక్కులు, పరిరక్షణ, బాలబాలికలకు గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు రాసి పాఠశాలలో ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలని సూచించారు. ఆ ఫిర్యాదు బాక్సును సచివాలయ మహిళా పోలీస్, వెల్ఫేర్ కార్యదర్శి, ఎడ్యుకేషన్ కార్యదర్శి పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు, డీపీవో శ్రీలత, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, స్కూల్ ప్రిన్సిపాల్ రఘురామ్ పాల్గొన్నారు.

భవిత సెంటర్ సందర్శన..

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలోని భవిత సెంటర్‌ను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సందర్శించారు. దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న సేవలపై తల్లిదండ్రులతో మాట్లాడారు. జిల్లా కో ఆర్డినేటర్ అబ్దుల్ ఆశ, భవిత టీచర్లు జగదాంబ, శారద పాల్గొన్నారు.

దేశంలో యూసీసీ సాధ్యం కాదు



మాట్లాడుతున్న జె.వి.ప్రభాకర్

సీతంపేట: భిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) ఎలా సాధ్యమని పలు దళిత సంఘాల నేతలు ప్రశ్నించారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం యూనీఫామ్ సివిల్ కోడ్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, లౌకికవాదం, మత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తే, దానికి భిన్నంగా బీజేపీ మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీ ప్రజలను అనుకూలంగా మార్చుకోవడం కోసమే ఇలాంటి విధానాన్ని బీజేపీ కొనసాగిస్తోందని ఆరోపించారు. దేశ సంపద కొందరి చేతుల్లోకి పోకుండా ఆర్థిక సివిల్ కోడ్ ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. 21వ లా కమిషన్ యూసీసీ సాధ్యం కాదని చెప్పినప్పటికీ.. 22వ లా కమిషన్ ద్వారా ఎందుకు చర్చిస్తున్నారన్నారు. మణిపూర్‌లో మారణ హోమానికి బీజేపీ, దాని అనుబంధ మనువాద సంస్థలే కారణమని ఆరోపించారు. ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా రోడ్లపై ఊరేగించిన ఘటనతో దేశం మొత్తం సిగ్గుపడాలన్నారు. యూసీసీ నిర్ణయాన్ని మార్చుకోవాలని, మణిపూర్ మారణకాండపై ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, టి.కాంతారావు, బీసీ సంఘం నాయకులు వేగి బాబూరావు, మల్లేశ్వరరావు, న్యాయవాదులు గిరిధర్, పాకా సత్యనారాయణ, మాజీ ఏఎస్పీ ప్రకాష్‌రావు, క్రైస్తవ సంఘం నాయకులు కె.సత్యశీలరావు, సీపీఎం కృష్ణారావు, సీపీఐ చంద్రశేఖర్, ఆర్.చిరంజీవి, సుబ్బన్న, కేవీపీఎస్ బి.మోహన్‌బాబు, నూకరాజు, గోవిందరాజులు, జార్జి బంగారి, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కు అభివృద్ధికి సహకారం



బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

మురళీనగర్: వాకర్స్ పార్కులో సదుపాయాల కల్పన, పచ్చదనం పెంపునకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. పార్కులో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం ఆయన ప్రారంభించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ తాగునీటి బోరు మంజూరు చేసి ఎన్నో ఏళ్ల నాటి వాకర్స్ కలను నెరవేర్చిన కార్పొరేటర్ ప్రసాద్‌కు, సబ్‌మెర్సిబుల్ పంప్, ఇతర కనెక్షన్లకు రూ.46,000 ఆర్థిక సాయం అందించిన క్లబ్ పూర్వాధ్యక్షుడు కేజీ కృష్ణారావు దంపతులకు వాకర్స్ క్లబ్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పార్కులో వాకింగ్ ట్రాక్, సభా ప్రాంగణం పైకప్పు నిర్మాణం, ల్యాండ్ స్కేపింగ్‌తోపాటు బ్యూటిఫికేషన్ మొక్కల పెంపకం, ప్రస్తుతం ఉన్న తాత్కాలిక మరుగుదొడ్ల స్థానంలో ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణానికి జీవీఎంసీ ద్వారా నిధులు మంజూరు చేయించాలని కార్పొరేటర్‌ను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ముందుగా కార్పొరేటర్ ప్రసాద్ బోరును ప్రారంభించి మొక్కలకు నీరు పెట్టారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రమౌళి, లంకా సుధాకర్, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, జాలీ వాకర్ ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, పి.చెల్వారాజు, వద్దాది అప్పారావు, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు, పూర్వాధ్యక్షులు ఎం.భాస్కర్‌రావు, సత్తి సునీల్‌రెడ్డి, ఓం వాకర్స్ అధ్యక్షురాలు వి.ప్రమీల, లలితారెడ్డి, యూనివర్సల్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ పి.శాంతారామ్, సాధారణ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సంతోష్ వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

భండాసుర వధపై ప్రవచనం



ప్రవచిస్తున్న రమ్యానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని జగన్మాత లలితాదేవి వివిధ పరివార దేవతల శక్తులను, రాక్షస సంహారంలో వారి పాత్రల గురించి ప్రవచించారు. భండాసుర వధ ఘట్టాన్ని వివరిస్తూ శ్రీబాల త్రిపుర సుందరీ దేవి, మహాగణపతి అవతార విశేషాలు, రాక్షస సైన్య వ్యూహాలను అమ్మవారు ఎలా చిత్తుచేశారు, భండాసురుడిని ఎలా వధించారో వివరించారు. అనంతరం భక్తులందరికీ వస్త్రం, శ్రీచక్ర యంత్రాలను ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రవచనాలు ఆలకించారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

40 కేజీల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ: మన్యం నుంచి పశ్చిమ బెంగాల్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ద్వారకా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా.. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో వారు పట్టుబడ్డారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ద్వారకా పోలీసులు తెలిపారు.

యువత కోసం

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. లలితా జ్యూవెల్లరీ మార్ట్, కల్యాణ్ జ్యూవెల్లర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, స్పందన స్ఫూర్తి, ఫైనాన్సియల్, హానర్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, యాక్సిస్ బ్యాంక్, టీమ్ లీజ్, ఎస్‌బీఐ అండ్ ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 535 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. 415 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 161 మంది ఎంపికైనట్లు వారు చెప్పారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి, అభ్యర్థులకు ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిల్లో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోండి



బీటీఆర్ కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది



విద్యార్థులకు దోమ లార్వాలను చూపిస్తున్న సిబ్బంది

సీతంపేట: వారం రోజులకు మించి వర్షపు నీరు లేదా తాగునీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ బంధం శ్రీనివాసరావు అన్నారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా 25వ వార్డు సీతంపేట బీటీఆర్ కాలనీలో దోమలు పెరిగే ప్రదేశాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించేలా యాంటీ లార్వా ఆపరేషన్లపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్లు, ఫ్రిజ్ వెనుక బాక్సులను శుభ్రపర్చి మళ్లీ నీరు పట్టుకోవాలని స్థానికులకు సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన కల్పించి, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

26వ వార్డులో..

ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణపై మలేరియా సిబ్బంది శివ అవగాహన కల్పించారు. వారం రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టడం వల్ల అవి వృద్ధి చెందుతాయన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తిచేసే దోమలు తాగునీరు, వర్షపు నీటి నిల్వల్లో పెరుగుతాయని వివరించారు. వారానికి ఒక రోజు నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులు, సంపులను శుభ్రపర్చుకోవాలని సూచించారు. దోమ లార్వాను విద్యార్థులకు చూపించారు. అటువంటి లార్వా మీ ఇంటి పరిసరాలు, నీటిలో పెరగకుండా చూడాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీఎస్‌పీఈ జేఏసీ సభ్యులు, విద్యుత్ ఉద్యోగులు

సీతమ్మధార: బకాయి పడిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్స్ సర్వీసులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(ఏపీఎస్‌పీఈ జేఏసీ) ప్రతినిధులు గణపతి, బి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విద్యుద్ సంస్థలో విలీనం చేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 1999–2004 మధ్య నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. పెరిగిన పనిభారానికి అనుగుణంగా అదనపు పోస్టులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అర్హత గల సిబ్బందిని బదిలీ ప్రక్రియ ద్వారా జూనియర్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.సత్యప్రసాద్, రత్నలరావు, వి.వి.మహేశ్వరరెడ్డి, ఎస్.చిరంజీవిరావు, టి.రామకృష్ణ, సింహాద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీని వల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపునకు గురై నష్టం వాటిల్లిన వరినారు సమాచారం ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీపీఏ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా వర్తించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామస్థాయిలో చర్చించిన విషయాలు జాయింట్ కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పశు సంవర్ధక, ఉద్యానవన, పట్టు, ఇతర అనుబంధ శాఖలు, పౌరసరఫరాల అధికారులు చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి



తలపై గాయంతో రోహిత్

సీతమ్మధార: ఓ యువకుడి తలపై గాయపరిచిన వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్ దరి రోహిత్ అనే యువకుడు నివసిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసిస్తున్న షేక్ కాజా మోహినుద్దీన్.. రోహిత్‌కు మధ్య గురువారం రాత్రి చిన్న పాటి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో మోహినుద్దీన్ దాడి చేయగా.. రోహిత్ తలకు గాయాలయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఫోర్త్‌టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా.. నిందుతుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇద్దరి ఇళ్లు ఒకే చోట ఉండటంతో గొడవ జరిగింది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.